

మజ్జివలస నుంచి పాత సామియ్యవలస రహదారికి గోతులు పెట్టి మట్టి, ఇసుక తవ్విన దృశ్యాలు



ఇసుక కోసం తవ్విన ప్రమాదకరమైన గోతిలో చేరిన నీరు



ఇసుక తవ్వకాలతో కోతకు గురైన సామియ్యవలస పంప్‌హౌస్‌కు వెళ్లే మార్గం

గోస్తనీ గుండెల్లో గునపాలు

- పాండ్రంగి పంచాయతీలో యథేచ్ఛగా ఇసుక దందా
- ఎడ్లబళ్లతో తరలించి ఖాళీ ప్రదేశాల్లో నిల్వ
- రాత్రి వేళ లారీలతో తరలించి విక్రయాలు
- నదిలో ప్రమాదకరంగా గోతులు

తగరపువలస : పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పాత సామియ్యవలస వద్ద గోస్తనీ తీరంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. ఎడాపెడా ఇసుక తవ్వకాల వల్ల నదికి వరదల సమయంలో తమ గ్రామం ముంపునకు గురవుతోందని ఒక వర్గం వ్యతిరేకిస్తుండగా మరొక వర్గం రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఎడ్ల బండ్ల ద్వారా సేకరించిన ఇసుకను సమీపంలో ఉన్న భీమిలి మండలం మజ్జివలసలో నిల్వ చేసి చీకటి పడిన తర్వాత లారీలు, ట్రాక్టర్ల ద్వారా దర్జాగా రవాణా చేస్తున్నారు. ఈ ఇసుకను మజ్జివలస ప్రాథమిక పాఠశాల ఎదురుగా గల పెద్ద భవనాల చాటుకు తరలిస్తున్నారు. అలాగే మహరాజుపేట – పద్మనాభం రహదారిలో మజ్జివలస ఎస్సీ కాలనీ ఎదురుగా ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. మజ్జివలస – పాత సామియ్యవలస కూడలి మొదలుకుని నదిలోకి వెళ్లే వరకు దారి పొడవునా ఇరువైపులా ఇసుక, మట్టి కోసం పెట్టిన గోతులు నోళ్లు చాచి మృత్యు



మజ్జివలసలో ఎస్సీ కాలనీకి ఎదురుగా ఇసుకాసురులు నిల్వ చేసిన ఇసుక

గుహల్లా చూస్తున్నాయి. ఇవి ఎంతలా ఉన్నాయంటే నదికి వరదలు వచ్చినప్పుడు ఈ గోతులు నీటితో నిండితే పొరపాటున ఎవరైనా దిగితే గల్లంతు కావాల్సిందే. ఇసుక తవ్వకాలు జరపకుండా గతంలో పద్మనాభం పోలీస్, రెవెన్యూ సిబ్బంది అడ్డంగా ఉంచిన తుమ్మచెట్లను సైతం లాగేసి రోజూ ఉదయం, సాయంత్రం వేళ గోస్తనీ గుండెల్లో ఇసుకాసురులు పలుగు, పార దించుతూ గుల్ల చేస్తున్నారు.

జీవీఎంసీ ఊటబావుల మనుగడకు కష్టం

ఈ మార్గంలోని నదిలో భీమిలి ప్రజలకు జీవీఎంసీ తాగునీరు సరఫరా చేసే ఆరు ఊటబావులు, పంప్‌హౌస్ ఉన్నాయి. ఇప్పటికే పంప్‌హౌస్‌ను ఆనుకుని నది కోతకు గురవడంతో ప్రహరీ, కొన్ని పైపులైన్లు నదిలో కలిసిపోయాయి. భవిష్యత్‌లో పంప్‌హౌస్‌ను ఆనుకుని సిబ్బంది క్వార్టర్స్‌కు కూడా ప్రమాదం పొంచి ఉంది. నదీ గర్భంలో ఊటబావుల చుట్టూ ఇసుక తవ్వకాల కారణంగా ఇప్పటికే నాలుగు పూర్తిగా ఎండిపోయాయి. అంతేకాకుండా ఏటా ఈ ప్రాంతంలో నీరు అడుగంటిపోవడంతో రూ.లక్షలు ఖర్చు చేసి ఇసుక బస్తాలతో కాపాడుకోవాల్సి వస్తోంది. ఈ ఇసుక బస్తాల నిర్మాణం కోసం జేసీబీ కూడా రాకుండా పాత సామియ్యవలసకు చెందిన వారు దారులను తవ్వేస్తుండటంతో అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంప్‌హౌస్ వద్ద కాపలా ఉండే పాండ్రంగి పంచాయతీకి చెందినవారు ఇసుక తవ్వకాలకు సహకరిస్తున్నట్టు పాత



పాత సామియ్యవలస వద్ద గోస్తనీనది పరిసరాల్లో ఇసుక కోసం చేసిన గోతులు

సామియ్యవలస వాసులు ఆరోపిస్తున్నారు. గతంలో తగరపువలస గోస్తనీనది నుంచి భీమిలి మున్సిపాల్టీ అవసరాలకు తాగునీరు సేకరించేవారు. ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాల కారణంగా భీమిలి మండలంలోని టి.నగరపాలెం, తాటితూరు, మజ్జివలస పంచాయతీలను దాటుకుని పద్మనాభం మండలంలోని సామియ్యవలస వరకు వెళ్లారు. ఇక్కడ కూడా ఇదే విధంగా ఇసుక తవ్వకాలు ప్రమాదకరంగా సాగుతుండటంతో ఈ ప్రాంతం కోతకు గురవడంతో నీటి కోసం పద్మనాభం వరకు వెళ్లాల్సి వస్తుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ దుస్థితి రాకుండా ఉండాలంటే మజ్జివలస, పాత సామియ్యవలస గ్రామాల మధ్య గోస్తనీ నది తీరంలో అక్రమ ఇసుక తవ్వకాలను అడుకోవాలని ఈ రెండు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

తగరపువలస : చిట్టివలస ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ఉచిత శిక్షణకు సంప్రదించాలని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటాన మోహనరావు, రేఖ అప్పారావు కోరారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు వంతున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. మూడేళ్లుగా ఇస్తున్న ఉచిత శిక్షణకు చుట్టుపక్కల గ్రామాల హైస్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరై ఇప్పటి వరకు 41 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు చిట్టివలస హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావును సంప్రదించాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ




వేపకొమ్మల అలంకరణలో సుత్తమ్మ తల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మ తల్లిని బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు వేపకొమ్మలు, నిమ్మకాయలు, గజమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని చుట్టుపక్కల గ్రామాల భక్తులు దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం : భీమిలిలో జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

గెడ్డలో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న పొక్లెయినర్

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం గెడ్డలో ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున వ్యర్థాలు కొట్టుకొచ్చాయి. దీంతో కల్వర్టులో ఉన్న మార్గాలు పూర్తి స్థాయిలో మూసుకుపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా కల్వర్టు పైనుంచి వరద పొంగి ప్రవహిస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో వ్యర్థాలు, మట్టి బుధవారం తొలగించారు.

తోటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని గొల్లలపాలెం వద్ద వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి ఆధ్వర్యంలో తోటమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, కోండ్రు రామ సూరప్పడు, జీరు వెంకట రెడ్డి, అల్లిపిల్లి నర్శింగరావు, అక్కరమాని రామునాయుడు, వాసుపల్లి కొండబాబు, వాసుపల్లి ఎల్లాజీరావు, గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు పాల్గొన్నారు.

రెండో విజయరామరాజుకు ఘన నివాళి



రెండో చిన విజయరామ రాజు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పద్మనాభం : పద్మనాభం యుద్ధంలో వీర మరణం పొందిన రెండో చిన విజయరామరాజు సంస్మరణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభంలోని విజయరామరాజు సమాధి వద్ద భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తి రాజు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

పద్మనాభం : 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని కోరుతూ పద్మనాభం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలని, పనికెందుకు తొందర... చదువుకో ముందర, అందరూ చదవాలి... అందరూ ఎదగాలి అనే నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. పద్మనాభం ప్రాథమిక పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని రాజవీధి ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా సాగింది. ర్యాలీలో ఎంఈవోలు పి.రమణ, ఎస్.డి.బాబులాల్, సమగ్ర శిక్ష అభియాన్



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో – ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ జి.లక్ష్మి, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, సీర్‌టీలు పాల్గొన్నారు.

పీఎఫ్ చట్టంలో మార్పులు నిలిపేయాలి

మధురవాడ : కార్మికుల హక్కుల పరిరక్షణకు మరిన్ని ఐక్య పోరాటాలు సాగించాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములప్పడు, సీహెచ్ శేషుబాబు పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 6, 7 వార్డుల కార్యాలయాల వద్ద బుధవారం నిరశన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, శ్రామికుల హక్కులు హరించే విధంగా చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ చట్టంలో మార్పులు వెంటనే ఆపాలని డిమాండ్



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, నాయకులు బి.రాంబాబు, బి.గోవింద్, బి.నర్శయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్న చట్టాలకు బీజేపీతో ముప్పు



అంబేడ్కర్ కూడలిలో మానవహారంగా కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, సీఐటీయూ నాయకులు

మధురవాడ : కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్చేస్తోందని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డిమాండ్ డేలో భాగంగా బుధవారం సాయంత్రం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మహిళా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు విశేషంగా తరలివచ్చారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ పెట్టుబడిదారులకు మేలు చేయడం కోసమే కార్మిక చట్టాలు మార్చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రీదేవి, విజయ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా కేంద్రాలు, కార్మికులను పెంచాలని కోరారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కనకరత్నం మాట్లాడుతూ అన్ని రకాల స్కీం కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు మంగశ్రీ మాట్లాడుతూ తెలుగుదేశం అధికారం చేపడితే వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, కోమలి, సత్యవతి, దేవి, వి.విజయ, సుధ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని ఆందోళన

తగరపువలస : అసంఘటిత రంగ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని కోరుతూ పలు సంఘాల కార్మికులు సిటు ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో బుధవారం ఆందోళన చేశారు. భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలపై మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, రిటైర్‌మెంట్ సదుపాయాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. పార్ట్‌టైమ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కొత్త పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపి సొంత గనులు కేటాయించాలన్నారు. భవన నిర్మాణ, ఆటో, ముఠా, తోపుడు బండ్ల కార్మికులకు బీమా, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్రచట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి శ్రీదేవి, అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి పద్మ, వీవోఏ సుశీల, భారతి, సన్యాసి పైడమ్మ, సరస్వతి, రమణమ్మ, అప్పలనరసమ్మ, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు

తగరపువలస : జీవీఎంసీ 3వ వార్డు నేరెళ్లవలస కాలనీలో మతిభ్రమించి ఒంటరిగా నివసిస్తున్న మాదాబత్తుల విజయలక్ష్మి అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె భౌతికకాయానికి ఓఎస్‌జీ, ఏఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ల ప్రతినిధులు భీమిలి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. భిక్షాటన చేసుకుంటూ నిర్మానుష్య ప్రాంతంలో నివసించే విజయలక్ష్మి అనారోగ్యానికి గురవడంతో స్థానికంగా నివసిస్తున్న గొర్రెపల్లి సన్యాసినాయుడు గుర్తించి ఈ రెండు ఫౌండేషన్ల ప్రతినిధులకు సమాచారం అందించాడు. దీంతో వారు ఆమెను భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం ఆమె కోరిక మేరకు తిరిగి నేరెళ్లవలసలో దించేసి చికిత్స అందించేవారు. చివరకు ఆమె మృతి చెందడంతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు దళాయి శివ, గుండాసు అరవింద్, ఒనుము కనకరాజు తదితరులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.



విజయలక్ష్మి భౌతికకాయాన్ని శ్మశానవాటికకు తీసుకొచ్చిన ఫౌండేషన్ల ప్రతినిధులు

వ్యాపారులకు సర్టిఫికెట్లు లేకుంటే చర్యలు

తగరపువలస : ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వ్యాపారులు సంబంధిత కంపెనీల నుంచి ఫారం – ఓ, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు విధిగా తీసుకోవాలని, లేదంటే వారి లైసెన్సులు రద్దు చేస్తామని వ్యవసాయశాఖ రంప చోడవరం ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి హెచ్చరించారు. నగరానికి చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.రవిప్రసాద్‌తో కలిపి బుధవారం సాయంత్రం తగరపువలసలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు, ధరల నియంత్రణ పర్యవేక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. బయో సిమెలంట్స్‌కి సంబంధించిన జీ2, జీ3 డాక్యుమెంట్లు, స్టాకు, నాణ్యత, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, లైసెన్స్ కాపీలు పరిశీలించారు. వ్యవసాయశాఖ మంజూరు చేసిన లైసెన్స్‌ను దుకాణంలో ప్రదర్శించాలని సూచించారు. కొనుగోలుదారులకు వివరాలతో కూడిన బిల్లులు, సంతకంతో కూడిన రశీదు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో భీమిలి ఏవో బి.శివకోమలి, టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



రసాయన మందుల దుకాణంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న అధికారులు

మందుబాబులకు రూ.1.2 లక్షల జరిమానా

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 12 మందికి భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య బుధవారం జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.2 లక్షలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి



శ్రీను (ఫైల్)

పద్మనాభం : తేనెటీగల దాడిలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల శ్రీను (45) ఈ నెల 2న విజయనగరం జిల్లా జామి మండలం అన్నమరాజుపేటలో పెయింటింగ్ పనులు ముగించుకుని రెడ్డిపల్లి వస్తున్నాడు. మార్గమధ్యలో పొట్నూరు సమీపంలో గోస్తనీ నది వద్ద తేనెటీగలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో చికిత్స కోసం విజయనగరం మహారాజు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుడు సాత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.




కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కేజిన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వలవేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మంజూరు చేసిన ఇళ్లపై విచారణకు వినతి



ఫిర్యాదు చేస్తున్న దామోదర్

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ సర్వే నంబర్ 152/1, ఇతర సర్వే నంబర్లలో గతంలో ఇళ్ల మంజూరులో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని అదే గ్రామానికి చెందిన కోరాడ దామోదర్ కలెక్టరేట్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. గత ప్రభుత్వ ఆశయాలకు భిన్నంగా బినామీలు, చనిపోయిన వ్యక్తుల పేరిట మంజూరు చేసిన పట్టాల విషయంలో అధికారులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరినట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస : ఆనందపురం మండలం పరదేశిపాలెం, వెల్లంకి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. బోయపాలెం, గంభీరం ఏపీఐఐసీ, కొత్త కల్లివానిపాలెం, వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట గృహ, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.